క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు



ఐలవరం(భట్టిప్రోలు): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు ప్రారంభించారు. చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన బైక్ మెకానిక్ ఆకురాతి సుబ్బారావును ఎస్ఐ అభినందించారు. సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు యువత ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో మాచర్ల వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం



భట్టిప్రోలు: శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని ఆదివారం భట్టిప్రోలు గ్రామ దేవత శ్రీ దండి పార్వతి అమ్మవారిని గౌడ సంఘం ఆధ్వర్యంలో పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారు తిరిగి సోమవారం దేవాలయానికి చేరుకోనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి పండ్లు, పూలు, టెంకాయలు సమర్పించి తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. అద్దేపల్లి గ్రామ దేవత అడెమ్మ అమ్మవారిని అద్దేపల్లి పద్మశాలీయ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం గ్రామోత్సవం కావించనున్నట్లు తెలిపారు. ఉగాది పర్వదినం మంగళవారం రావడంతో భట్టిప్రోలు గ్రామ దేవతను ఆదివారమే పురవీధులలో గ్రామోత్సవం గావించారు. ముండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాది వేడుకలు జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అలాగే పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు చేసే పనిలో నిర్వాహకులు నిమగ్నమయ్యారు.

ఓబీసీ పోస్టల్ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం



రేపల్లె రూరల్: తెనాలి డివిజన్ ఓబీసీ పోస్టల్ ఉద్యోగుల ఐక్యతా సమావేశం పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఓబీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించటానికి పోస్టల్ యూనియన్స్, కేడర్ బ్యానర్‌కు అతీతంగా ఓబీసీ ఉద్యోగులను ఒక తాటిపైకి తీసుకురావటంతో పాటు తపాలశాఖలో ఒక స్వయం ప్రతిపత్తి ఉన్న ఒక ఫెడరేషన్‌గా రూపొందించటం జరుగుతుందని ఓబీసీ ఉద్యోగులు తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ పోస్టల్ ఉద్యోగులు నరేంద్ర, సాయి ప్రసాద్, రాంప్రసాద్, రాధాకృష్ణ, నాగరాజు, కార్తీక్, గోపి, ఓబీసీ పోస్టల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

బండ్లమ్మ వారికి ప్రత్యేక పూజలు



చందోలు(పిట్టలవానిపాలెం): మండలంలోని చందోలులో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో దేవాలయానికి తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు పెనుగొండ బాలకృష్ణమూర్తి, బుడ్డా వెంకటలక్ష్మి, ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింమూర్తి తదితరులు ఉన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



భట్టిప్రోలు: సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకుని కేంద్ర సాయుధ బలగాలతో కలసి ఆదివారం పోలీసులు గ్రామాల్లో కవాతు నిర్వహించారు. భట్టిప్రోలు, రైల్వేగేట్, వెల్లటూరు, సూరేపల్లి, తాతావారిపాలెం, పురవీధులలో సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించి ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని అన్నారు. బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశానుసారం ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. పోలీసులు భద్రత కల్పిస్తారనే ఆలోచన ప్రజల్లో కల్పించే ఉద్దేశ్యంతో కవాతు నిర్వహించినట్లు తెలిపారు. అందరూ ఎన్నికల నియమావళిని తూచా తప్పకుండా పాటించి ఎలాంటి ప్రలోభాలకు గురి కావద్దని సూచించారు. రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. వెల్లటూరు చెక్‌పోస్టు వద్ద వాహనాలను సోదా చేసారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే సుభిక్ష పాలన

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు
- వైఎస్సార్ సీపీ హయాంలో శతశాతం సంక్షేమం, అభివృద్ధి



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ వర్గీయులతో ఎంపీ మోపిదేవి, డాక్టర్ ఈవూరి గణేష్

రేపల్లె రూరల్: రాష్ట్రాన్ని సుభిక్షంగా ఉంచేందుకు నూతన సంస్కరణలు తీసుకువచ్చి వాటిని అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 23వ వార్డులో ఆదివారం నిర్వహించిన ఇంటింటా ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పాలన పారదర్శకంగా జరగాలన్న ఉద్దేశ్యంతో నూతన పాలనా సంస్కరణలను ప్రవేశపెట్టి రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు సచివాలయాల ద్వారా పారదర్శక పాలనను ప్రజలకు అందిస్తున్నారన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పార్టీలకు అతీతంగా సచివాలయాల ద్వారా సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేశారన్నారు. ఏ ఇంట చూసినా ఏ వ్యక్తిని కదిలించినా తాము వైఎస్సార్ సీపీ అందించిన సంక్షేమ ఫలాలను అందుకుని లబ్ధి పొందినట్లు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. వలంటీరు వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల గృహాలకే లబ్ధిని అందించారన్నారు. నిస్వార్థ పూరితమైన సేవలు అందిస్తున్న వలంటీర్లపై కుట్ర రాజకీయాలు చేసి అభివృద్ధి నిరోధకుడిగా చంద్రబాబు చరిత్రలో నిలిచిపోతారన్నారు. చంద్రబాబు అవ్వాతాతలకు పెన్షన్‌ను ఇళ్లకు తీసుకెళ్లనివ్వకుండా అడ్డుకున్న విషయం అందరికి విదితమేనన్నారు. రాష్ట్రంలో ప్రజలు జగనన్నకు మరోమారు పట్టం కట్టేందుకు చంద్రబాబుకు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

రేపల్లె నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ గణేష్‌కు ప్రజలు మద్దతు తెలిపి విజయానికి కృషి చేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్ మాట్లాడుతూ సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించటమే కాకుండా ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ప్రజా ప్రతినిధులనే ప్రజల్లోకి తీసుకెళ్లిన గొప్ప నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. గడప గడపకూ వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ప్రజల హృదయాలలో తన స్థానాన్ని పదిలం చేసుకున్న జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల ఆదరాభిమానాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం వార్డులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జున రావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు మోపిదేవి రాజీవ్‌బాబు, డాక్టర్ ఈవూరు సృజన్, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్‌చైర్మన్ తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, వివిధ వార్డుల కౌన్సిలర్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 20 టీడీపీ కుటుంబాలు చేరిక

రేపల్లె రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీకి స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతున్నారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. నిజాంపట్నం మండలంకు చెందిన 20 టీడీపీ కుటుంబాలు నిజాంపట్నం ఎంపీపీ మోపిదేవి విజయ నిర్మల హరనాథ్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పట్టణంలోని పత్తిపాటి సీతారామయోగిని కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు, నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్‌లు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి సైనికుల్లా పని చేయాలని కోరారు. అనంతరం కల్యాణ మండపంలో నిర్వహించిన గౌడ సంఘీయుల ఆత్మీయ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు.

ఆటో ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి గాయాలు



పల్టీ కొట్టిన ఆటోను పైకి లేపుతున్న స్థానికులు

కొల్లూరు : అతివేగంగా వస్తున్న ట్రాలీ ఆటో ఢీకొని ఓ ద్విచక్ర వాహనదారుడు గాయాల బారిన పడగా అతని వాహనంపై ఉన్న మహిళ స్వల్ప గాయాలకు గురైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. నరసరావుపేట సమీపంలోని కేశానుపల్లికి చెందిన ఆటోలో డ్రైవర్ సరకు లోడ్ చేసుకొని కృష్ణా జిల్లా చల్లపల్లిలో అన్‌లోడ్ చేసి తిరిగి నరసరావుపేట వెళుతున్నాడు. అదే సమయంలో తెనాలి సుల్తానాబాద్‌కు చెందిన సిరివీదుల వెంకటేశ్వరరావు తన టీవీఎస్ మోపెడ్‌పై ఓ మహిళను ఎక్కించుకొని కృష్ణా జిల్లా వెళుతున్నాడు. మండలంలోని దోనేపూడి శివారు ఆలపాటినగరం సమీపంలోని మలుపు వద్దనున్న స్పీడ్ బ్రేకర్‌ను గమనించని ఆటో డ్రైవర్ అతివేగంగా రావడంతో ఆటో అదుపుకోల్పోయి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడు వెంకటేశ్వరరావును ఢీకొట్టి రోడ్డు పక్కకు పల్టీలు కొట్టింది. ఆటో ఢీకొట్టిన అదటుకు వెంకటేశ్వరరావుతో పాటు, అతని వాహనంపై ఉన్న మహిళ గాలిలో ఎగిరి పంట పొలాలు పక్కనున్న నీరులేని పంట కాలువలో పడిపోయారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు కాలువలో పడిపోయిన వారిని పైకి తీసుకొచ్చారు. ప్రమాదంలో కాలు విరిగిన వెంకటేశ్వరరావును కొల్లూరు ఏఎస్ఐ అర్జున్‌రావు, స్థానికులు 108 వాహనంలో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆటోడ్రైవర్ అటుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఎక్కి సంఘటనా ప్రాంతం నుంచి పరారయ్యాడు. సంఘటనపై వైద్యశాల నుంచి వచ్చే నివేదిక ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఏఎస్ఐ అర్జున్‌రావు తెలిపారు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం



ప్రమాదంలో అగ్నికి ఆహుతైన గృహం

కొల్లూరు : అగ్నిప్రమాదం సంభవించి ఓ పూరిల్లు దగ్ధమవ్వగా, గృహంలో ఉన్న వాళ్లు ప్రాణాలు కాపాడుకొని కట్టుబట్టలతో బటయపడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబం, స్థానికుల కథనం మేరకు మండలంలోని తడికలపూడికి చెందిన రావుల కిశోర్‌బాబు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం సమయంలో పూరింటి పైకప్పు నుంచి మంటలు వ్యాపిస్తుండటంతో గమనించిన కిశోర్ భార్య వెంటనే అప్రమత్తమై తన ముగ్గురు పిల్లలను ప్రమాదం బారి నుంచి కాపాడి బయటకు చేర్చింది. ఇంట్లో ఉన్న నగదు, ఇతర సామాగ్రిని తీసుకొచ్చేందుకు ప్రయత్నించేలోపే అగ్నికీలలు ఎగసి పడుతూ ఇల్లు మొత్తం వ్యాపించడంతో సర్వం ప్రమాదంలో అగ్నికి ఆహుతయ్యాయి. రెండు రోజుల క్రితమే కంద పంట విక్రయించగా వచ్చిన నగదు సుమారు రూ.3 లక్షలతో పాటు, బంగారు ఆభరణాలు, ఇంటిపక్కనే ఉన్న సుమారు 5 ఎకరాల వరిగడ్డి వాము దగ్ధమయ్యాయి. ప్రమాదం కారణంగా సుమారు రూ. 6 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది. ప్రమాదానికి విద్యుదాఘాతం కారణమై ఉండవచ్చునని స్థానికులు భావిస్తున్నారు.

22న మావూరమ్మ విగ్రహ ప్రతిష్ట

రేపల్లెరూరల్: మండలంలోని రుద్రవరం గ్రామంలో ఈ నెల 22 నుంచి 24 వరకు మావూరమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠా మహాకుంభాభిషేక మహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 20న విఘ్నేశ్వర పూజ, అఖండ దీపస్థాపన, ప్రతిష్ఠాపనా మూర్తుల గ్రామోత్సవం, 21న హోమాది పూజలు, 22న మహా పూర్ణాహుతి, కుంభ ఆలయ ప్రదక్షిణ, మహాకుంభాభిషేకం, అన్న సంతర్పణ కార్యక్రమాలు నిర్వహించబడునని తెలిపారు. పూజాది కార్యక్రమాలలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నేడు పోతార్లంకలో ఎన్నికల ప్రచారం

కొల్లూరు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు సోమవారం మండలంలోని పోతార్లంకలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు కొల్లూరు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ ఆదివారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు వరికూటి అశోక్‌బాబు పాల్గొననున్నట్లు చెప్పారు. ప్రచార కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ సీపీ అభిమానులు హాజరుకావాలని కోరారు.

సంక్షేమ ప్రభుత్వానికి పట్టం కడదాం

పిట్టలవానిపాలెం: బాపట్ల జిల్లా సాధకుడు, అభివృద్ధి ప్రదాత కోన రఘుపతిని బాపట్ల శాసన సభ్యునిగా మూడో సారి ఆశీర్వదించాలని బాపట్ల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి కోన రఘుపతి తనయుడు కోన నిఖిల్ కోరారు. మండలంలోని పిట్టలవానిపాలెం గ్రామ సచివాలయ పరిధిలో కోన రఘుపతి తనయుడు నిఖిల్ గ్రామ సర్పంచ్ బొలగాని అరుణ కుమారి, పార్టీ నాయకులు సుబ్బారావుల ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి కొనసాగుతుందని అన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా మహిళా అధ్యక్షురాలు యేట్ర అశ్వినిరెడ్డి, మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీలు దెందుకూరి సీతారామరాజు, చేబ్రోలు కృపానందం, దోమ తిరుమలరెడ్డి, మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, డి.కోటిరెడ్డి, కుంతం ప్రసన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

శలపాడులో గాయత్రీ హోమం

చేబ్రోలు: చేబ్రోలు మండలం శలపాడు గ్రామంలో ఆదివారం గాయత్రీ హోమం వైభవంగా నిర్వహించారు. శలపాడులోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఆదివారం ఉదయం గాయత్రీ యజ్ఞంను అర్చకులు ఘనంగా నిర్వహించారు. గంజాం సత్యనారాయణచార్యులు, మహేంద్రబాబుల ఆధ్వర్యంలో జరిగిన గాయత్రీ యజ్ఞం కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రాంగణ ఎంపికల్లో జీవీఆర్‌ఎస్ విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల చైర్మన్ డాక్టర్ సింధూర, డైరెక్టర్ కరిమున్నీసా

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించి ఉపాధి లక్ష్యంగా తమ కళాశాల ఎల్లప్పుడూ కృషిచేస్తుందని జీవీఆర్‌ఎస్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ ఎస్.సింధూర తెలిపారు. ఆదివారం బుడంపాడు గ్రామంలోని కళాశాలలో విజయవాడకు చెందిన ఐటీటీ హ్యాకథాన్, సైప్రో సెక్యూరిటీ సొల్యూషన్స్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మాట్లాడుతూ నేటి ఆధునిక ప్రపంచంలో సాంకేతిక నైపుణ్యం ఎంతో అవసరమని తెలిపారు. తమ కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో మొత్తం 160 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో 100 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఉద్యోగాలకు ఎంపికై న విద్యార్థులను సైప్రో ట్రైనర్ చైతన్యరాణి, కళాశాల డైరెక్టర్ షేక్ కరిమున్నీసా, కళాశాల ప్రిన్సిపాల్ కె.రమేష్‌బాబు, డీన్ బి.వరప్రసాద్ వివిధ విభాగాల అధిపతులు ప్రత్యేకంగా అభినందించారు.

'కాయితాల రుజువు' కథల సంపుటి ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వరలక్ష్మి, లక్ష్మీనారాయణ తదితరులు

పాత గుంటూరు: నమ్మిన సిద్ధాంతాల కోసం రచనలు చేస్తున్న ప్రముఖ రచయిత్రి నల్లూరి రుక్మిణి అభినందనీయులని అరుణతార పత్రిక వర్కింగ్ ప్రెసిడెంట్ పి. వరలక్ష్మి పేర్కొన్నారు. ఆదివారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ సమావేశ మందిరంలో నల్లూరి రుక్మిణి రచించిన 'కాయితాల రుజువు' కథా సంపుటిని వరలక్ష్మి ఆవిష్కరించి మాట్లాడారు. సమాజంలో ఫైనాన్స్ పెట్టుబడిదారులు చేస్తున్న విధ్వంసాన్ని, సంక్షోభాన్ని, కుటుంబ జీవితాల్లోని మనుషుల వ్యక్తిత్వాలను, వెతలను కథల సంపుటిలో కళ్లకు కట్టినట్లు చూపారని తెలిపారు. ఉపాధ్యాయుడు మోదుగుల రవికృష్ణ మాట్లాడుతూ సమకాలిన సమస్యలకు శ్వేత పత్రం లాంటిది కాయితాల రుజువు పుస్తకం అన్నారు. సభకు అధ్యక్షత వహించిన అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రచయిత్రి రుక్మిణి 'కాయితాల రుజువు' కథల సంపుటి ఆలోచనలను రేకెత్తిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్, విరసం సి.ఎస్.ఆర్. ప్రసాద్, కాపు శ్రీనివాసరావు, ప్రొఫెసర్ వేణుగోపాలరావు, పలువురు రచయితలు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

వైభవంగా 'స్వరలయ'ఉగాది వేడుకలు

తెనాలి: పట్టణానికి చెందిన సంగీత సాంస్కృతిక సంస్థ స్వరలయ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో జరిగిన సభకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సాయి లక్కరాజు అధ్యక్షత వహించారు. ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీ క్రోధి నామ సంవత్సరం ప్రజలందరికీ సుఖ సంతోషాలను కలిగించాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. ప్రముఖ పౌరాణిక రంగస్థల నటుడు ఎం.రామలింగేశ్వరరావు, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘ కార్యదర్శి వేదాంతం ఫణీంద్ర, సామాజిక సేవకుడు షేక్ ఇనయతుల్లాకు ఉగాది పురస్కారాలను ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గుడిమెళ్ల శ్రీకూర్మనాథ్, ఎల్ఐసీ ఉద్యోగుల జోనల్ జాయింట్ సెక్రటరీ జి.కిశోర్‌కుమార్ (మచిలీపట్నం), పట్టణ రంగస్థల కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, రావిపాటి ప్రేమ్‌కుమార్ మాట్లాడారు. తొలుత ఎం.సత్యవర్ధన్, కత్తి సౌజన్యచే సినీ సంగీత విభావరిని నిర్వహించారు. ముత్తింశెట్టి శివాని మహిషాసుర మర్దిని నృత్యాంశం ఆకట్టుకుంది.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే కోన రఘుపతి
- కర్లపాలెం మండలంలో జోరుగా ఎన్నికల ప్రచారం

కర్లపాలెం: ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ గ్రామ సచివాలయాల ద్వారా అందుతున్నాయని ఇది దేశ చరిత్రలోనే చారిత్రాత్మక ఘట్టమని ఎమ్మెల్యే, బాపట్ల వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కోన రఘుపతి చెప్పారు. ఆదివారం సాయంత్రం కర్లపాలెం మండల పరిధిలోని శ్రీరామ్‌నగర్, తిమ్మారెడ్డిపాలెం, బోలాయపాలెం, నాగరాజుపాలెం, దుండివారిపాలెం, అక్కిరాజుదిబ్బ, యాజలి గ్రామాలలో కోన రఘుపతి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 19న బాపట్ల అసెంబ్లీకి వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్నానని పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు వేలాదిగా తరలివచ్చి తన అభ్యర్థిత్వాన్ని బలపరచాలని కోరారు. మళ్లీ సీఎంగా జగనన్న వస్తేనే సంక్షేమ పథకాలన్నీ ప్రజల ఇంటి ముంగిటకి వస్తాయని ప్రజలు ఆలోచించి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఎన్నికల హామీలకు కోత పెట్టిన ఘనత చంద్రబాబుదని.. 99శాతం హామీలు అమలు పరిచిన ఘనత సీఎంకు దక్కుతుందని చెప్పారు. తమ ప్రభుత్వంలో పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించటం, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లు నిర్మించటంతో గ్రామాల రూపురేఖలు మారిపోయాయని కోన చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, నాయకులు ఆట్ల నాగేశ్వరరెడ్డి, అమీర్‌బేగ్, ఆసిఫ్ అలీ, తాజ్, నాదెండ్ల భానుప్రసాద్, చిక్కాల సాగర్, పులుగు మునిగిచంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి, అక్కల శ్రీనివాసరెడ్డి, కేసాని భావన్నారాయణ, కారంకి ప్రసాద్, మరుప్రోలు శివారెడ్డి, పివిరెడ్డి, దుండి చలపతిరెడ్డి, ఆట్ల అయ్యప్పరెడ్డి, ఆట్ల హరిబాబురెడ్డి, ఏట్ర ప్రసాద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కర్లపాలెంలో ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కర్లపాలెం: ఆయుర్వేదం, న్యాచురోపతి వైద్య సేవలు వినియోగించుకోవాలని కేర్‌యోగా న్యాచురోపతి వైద్యులు సూర్యవంశీ, భ్రమరాంబిక తెలిపారు. స్థానిక రామకృష్ణ సేవా సమితిలో ఆదివారం ఉచిత న్యాచురోపతి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 120 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు సూర్యవంశీ, భ్రమరాంబిక మాట్లాడుతూ ప్రకృతి వర ప్రసాదాలైన ఆయుర్వేదం, న్యాచురోపతి వైద్యానికి మళ్లీ ఆదరణ పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సుచరిత, సమీర, భాష్మీల, నిర్వాహకులు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, కిషోర్, నాగేశ్వరరావు, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో స్త్రీల ఆదివారం



విజయను సన్మానిస్తున్న స్త్రీల సమాజం ప్రతినిధులు

భట్టిప్రోలు: భట్టిప్రోలు ఏఈఎల్‌సీ చర్చిలో స్త్రీల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక క్రీస్తు లూథరన్ దేవాలయంలో స్త్రీల సమాజం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో భాగంగా సంఘ సేవకురాలు దాసరి విజయ దేవునికి మహిమకరంగా ప్రార్థనలు నిర్వహించారు. ఏసు క్రీస్తు పునరుత్థానుడై వచ్చినపుడు స్త్రీలను చూశారని అందుకే ఆయన గౌరవార్థం స్త్రీల ఆదివారాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆరాధనలో పాస్టర్ రెవరెండ్ దాసరి రవీంద్ర వర్మ మాట్లాడుతూ దేవుని పరిచర్యలో స్త్రీలు అధికంగా పాల్గొంటున్నారని తెలిపారు. దేవుని ప్రణాళికలో వారు ప్రత్యేక స్థానం కలిగి ఉన్నారని చెప్పారు. వారి ద్వారా దేవుడు గొప్ప పనులు చేయిస్తాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఆరాధనలో స్త్రీల సమాజ సభ్యులు కనపర్తి రాజకుమారి, అంబటి రోజ, దోమ నయోమి, కనపర్తి పార్వతి, పయర్ల వెంకటేశ్వరమ్మ, అంబటి అనిత, ఆమెరే సుజాత, దాసరి దివ్యరాణి, సంఘ పెద్దలు, యూత్ చిల్డ్రన్స్, సంఘస్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతో జనరంజక పాలన

భట్టిప్రోలు: అవినీతి రహిత పాలనతో పాటు అర్హులందరికీ సంక్షేమ లబ్ధి చేకూర్చిన సీఎం జగన్ మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు తనయుడు శ్రీ తేజస్ పేర్కొన్నారు. ఆదివారం భట్టిప్రోలు మండలం పెసర్లంక, పెదలంక, గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలసి గ్రామాల్లోని ఇంటింటికి వెళ్లి సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. పెసర్లంకలో వరిగడ్డి ట్రాక్టర్‌ను నడిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, పెసర్లంక, చింతమోటు సర్పంచులు వేములపల్లి వెంకటేశ్వరరావు, గుమ్మడి శంకరరావు, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, ఎంపీటీసీ సభ్యులు నన్నెపాముల చంటి, న్యాయవాది చిలుమూరు రామోహన్‌రావు, నన్నెపాముల శివకుమార్, గుజ్జర్లమూడి రాజు, మాతంగి రత్నకుమార్, జేఏసీ కన్వీనర్ గోవర్ధనగిరి చినబుజ్జి, దావూరి నాగమల్లేశ్వరరావు, నన్నెపాముల శ్యామ్‌బాబు, ప్రభుదాసు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న రాజ్యాన్ని పునర్నిర్మిద్దాం



పెరవలి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో వరికూటి లక్ష్మి

పెరవలి(వేమూరు): రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు సతీమణి వరికూటి లక్ష్మి కోరారు. వేమూరు మండలంలోని పెరవలి గ్రామంలో ఆమె ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళకు అందజేస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. కాపునేస్తం పథకం ద్వారా కాపు మహిళలకు వారి అకౌంట్‌లో డబ్బులు జమ చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం కల్పిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దాది వెంకట లక్ష్మీ రాజ్యం, దాది సుబ్బారావు, ఎంపీపీ యల్లమాటి మోహన్, జెడ్పీటీసీ గాజుల హేమలత, ఎంపీటీసీ దాది రజిని, మండల పార్టీ అధ్యక్షులు బొల్లిముంత ఏడుకొండలు, దాది కాకులేశ్వరరావు, పట్టెల రంగబాబు, మాజీ సర్పంచ్ దాసరి పోతురాజు, మాజీ ఎంపీటీసీ దాసరి మోహన్‌రావు, దాసరి దుర్గారావు, గాజుల భాను ప్రకాశ్, కొండ్రు శ్రీనివాసరావు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీస్తు రక్తంతోనే పాప ప్రక్షాళన



వాక్యోపదేశం చేస్తున్న బాల ఏసుదేవాలయ విచారణ గురువులు పి.బాలస్వామి

ఫిరంగిపురం: కారుణ్య జపం, క్రీస్తు రక్తంతోనే పాప ప్రక్షాళన జరుగుతుందని బాల ఏసుదేవాలయ విచారణ గురువులు పి.బాలస్వామి అన్నారు. మండలకేంద్రంలోని బాల ఏసుదేవాలయంలో పునరుత్థానం తరువాత వచ్చే ఆదివారం దివ్యభారతి ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన వాక్యోపదేశం చేస్తూ సిలువపై ఉన్న క్రీస్తును సైనికులు బల్లెముతో పక్కలో పొడిచినప్పుడు శరీరం నుంచి రక్తం, నీరు వచ్చిందని, రక్తం నీరుతో భక్తుల పాప ప్రక్షాళన జరుగుతుందన్నారు. అదేవిధంగా ఒక వైపు చీకటి, ఒక వైపు వెలుగు ఎలా ఉంటుందో అదేవిధంగా దివ్యకారుణ్యం అనేది నిండి ఉంటుందని చెప్పారు. క్రైస్తవ సంఘం విధులు నాలుగు ఉన్నాయన్నారు. అవి అపోస్తులుల బోధ, సహవాసం, రొట్టె విరవడం, సంఘముగా కుటుంబం ప్రార్థనలు చేయడం ద్వారా శక్తి ఏర్పడుతుందని తెలిపారు. దానిలో బలం, ధైర్యం నిండి ఉంటాయన్నారు. అనంతరం దివ్యపూజాబలి నిర్వహించారు.